# మానవుని ప్రధాన లక్ష్యము భగవద్భక్తియే!

పలికి బొంకనివాడె పో పండితుండు
ఆడితప్పని మనుజుండె అర్చకుండు
ఆశవదలిన వాడెపో ఆత్మబలుడు
సత్యము తెలుపుబాట ఈ సాయిమాట
తత్త్వమెరిగిన వానికి తపస్సు ఏల
సత్యమున్నట్టి వానికి సాధనేల
కల్లకపటాలు లేకున్న క్రతువు ఏల
మరువబోకుదు ఇటువంటి మంచిమాట

**ప్రేమస్వరూపులారా!**

ఇది నవీన నాగరికత యుగము. సాంకేతిక విజ్ఞానము విలసిల్లినట్టి కాలము. ఇట్టి కాలమున ఎట్టి వైద్యమునకు లొంగనట్టి రోగము ప్రతి మానవునియందు కూడను వ్యాపించి వున్నది. ఈ దేశమనే కాదు, ఏ దేశమందైనకూడను ప్రతి మానవునియందు ఎట్టి వైద్యమునకు లొంగనట్టి రోగము ప్రవేశించి వున్నది. ఒకరికి ఈ రోగము అధికమై ముదిరిపోయి వుండవచ్చును; కొందరికి యిది ప్రారంభదశలో వుండవచ్చును. ఇంకా కొంతమందికి ఇది మధ్యస్థితిలో బాధించుచుండవచ్చును. ఇది ఏమి రోగము? ఇదియే అహంకారము. ఇది ఎట్టి వైద్యమునకుకూడను లొంగనిది. ఈ అహంకారమునకు మూలకారణము ఏమిటి? ఇది అవివేకమునుండి పుట్టినది. ఈ అవివేకమునకు మూలకారణమేమిటి? ఇదే రాగము. ఈ రాగమే కేవలము రోగముగా మారుతూ వచ్చింది. రాగమనగా ఏమిటి? 'దేహమే నేను, ఈ దేహమునకు సంబంధించినది యావత్తునాది' అని అభిమానము మరియు మమకారములచేత ఈ రాగము మరింత బలపడిపోతున్నది. నేనే ఈ దేహమనేది అహంకారము. దీనికి సంబంధించినదంతయు నాదే అన్నది మమకారము. ఈ అహంకార, మమకారములచేత

srisathyasaivachanamrutam

మానవుడు అంధుడై జీవిస్తున్నాడు.

**జాగ్రత్స్వప్న సుషుప్తులు, స్థూలసూక్ష్మకారణములు తనవి కావనే విరాగము పెంచుకున్నప్పుడే రాగము దూరమవుతుంది**

అయితే, ఈ రాగమునకు పరిహారము వున్నది, లేకపోలేదు. రాగమునకు, విరాగము మందు. ఈ విరాగమనగా ఏమిటి? ఈ విరాగ తత్త్వము చక్కగా గుర్తించినప్పుడే దీనిని వుపయోగించుకునే విధానము మనకు అర్థమవుతుంది. ఈ విరాగమనేదాంట్లో లోతునకు విచారించినప్పుడు ఒకటి భౌతికము. అదియే స్థూలము. రెండవది సూక్ష్మము. మూడవది కారణము. ఈ మూడింటియొక్క తత్త్వాన్ని మనము గుర్తించినప్పుడు సులభముగా వైరాగ్యము ఆవిర్భవిస్తుంది. స్థూలము జడమైనది. పర్వతములు కేవలము శిలామయములు. వృక్షములు కాష్టమయములు. భూమి మృణ్మయము, దేహము మాంసమయము. ఇవన్నీ జడములే! ఈ స్థూలము జడమనే సత్యము మనము గుర్తించినప్పుడు దీనిపై రాగమనేది ఏమాత్రము ప్రవేశించదు.

ఇంక సూక్ష్మమనే దానియందు సూక్ష్మమైన విచారణ సలపాలి. స్వప్నావస్థ యందు మనము అనేక దృశ్యములు చూస్తున్నాము. ఆ చూచిన కన్నులు ఎవరివి? ఈ స్వప్నావస్థయందే మనము అనేక శబ్దములను శ్రవణము చేస్తున్నాము. ఈ వినే చెవులు ఎవరివి? ఈ స్వప్నావస్థయందే అనేక విధములుగా చర్చిస్తున్నాము, సంభాషిస్తున్నాము. యిందులో ఎవరు మాట్లాడుతున్నారు? ఎవరిదీ నోరు? స్వప్నమునందే అనేక పదార్థములను మనము భుజించుచున్నాము, రుచి చూచుచున్నాము. ఈ నాలుక ఎవరిది? అనేక ప్రదేశములలో మనము సంచరిస్తున్నాము. ఈ పాదములు ఎవరివి? అనేక పనులు మనము చేయుచున్నాము. ఈ హస్తములెవరివి? కానీ జడమైన ఈ దేహము ఒక చాపపైననో, పరుపుపైననో పడివున్నది. స్థూలదేహమందున్న అంగములు ఏమాత్రము పనిచేయటము లేదు. కానీ, ఈ స్వప్నావస్థయందు ఇన్ని పనులు చేయుచున్న ఈ అంగములు ఎవరివి? ఇవి ఎక్కడనుంచి వచ్చినవి? ఎవరు సృష్టించారు? ఇవన్నీకూడను భ్రాంతితో కూడినవే! ఎంతవరకు ఈ భావములు అనుభవిస్తున్నాయి? మేలుకొనునంతవరకు యివి అనుభూతిలో వుంటాయి. మేలుకొన్న

sri sathyasai vachanamrutam

తక్షణమే యివన్నీ కనిపించవు. కలలో చూచిన మేడలు మిద్దెలు కన్నులు విప్పిన లేవుకదా! కనుక, ఈ స్వప్నావస్థయందు వుండినవన్నీకూడను కేవలము మాయగా రూపొందుతుంది. జాగ్రత్త-జడము స్వప్నము-మాయ, కారణమా-ప్రతిబింబము. ఎవరిదీ ప్రతిబింబము? మహాకారణ స్వరూపుడైన పరమాత్మునియొక్క ప్రతిబింబమే! కనుక జాగ్రత్ స్వప్న సుషుప్తులు, స్థూల సూక్ష్మ కారణములు నాకు సంబంధించినవి కావనే విరాగమే యీ రాగమును దూరము గావిస్తుంది.

### వివేకములేని మానవునకు శాస్త్రము మహాభారము

ఇట్టి విరాగమునకు విచారణ అత్యవసరము. అయితే, ఈ విచారణ గురించి అనేక శాస్త్రములు అనేక విధములుగా తెలియజేస్తూ వచ్చాయి. శాస్త్రములలో చెప్పబడిన విషయాలను సరైన రీతిగా ప్రబోధించి ప్రచారము సల్పే వ్యక్తులు లేకపోవటంచేత ఈ శాస్త్ర సంబంధమైన ధర్మములన్ని అపమార్గములకు గురవుతున్నాయి. వివేకములేని మానవునకు శాస్త్రము మహాభారము. వైరాగ్యము లేని మానవునకు జ్ఞానము అసలేవుండదు. శాంతి లేనివానికి మనస్సు చాలబరువు. ఆత్మజ్ఞానము అర్థము కానివారికి శరీరమే పెద్దభారము. కనుక, ఈ విధమైన బాధలచేత రోగములు మనము అనుభవిస్తున్నాము. గాలినైననూ మూటకట్టవచ్చు. గగనమును ముక్కలు ముక్కలు గావించవచ్చు. సముద్రములోని అలలను అట్లనే నిలబెట్టవచ్చు. కానీ ప్రేమస్వరూపులారా! మానవుని ఆయుష్షును ఎవ్వరూ నిలబెట్టలేరు. ఆయువు అత్యల్పము. ఆయువున్నంతలోపలనే ఆత్మతత్త్వమును గుర్తించటానికి ప్రయత్నించాలి. నిజముగా ఈ ఆయువు ఆత్మతత్త్వాన్ని గుర్తించుకునే నిమిత్తమై ఏర్పడినదనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. సముద్రమునైనను మనము సులభముగా త్రాగవచ్చు. పర్వతమును కూడను పెకలించవచ్చును. అగ్నినికూడను మనము ఆహారముగా భుజించవచ్చును. కానీ మనసు తత్త్వాన్ని తెలుసుకోటం మహాకష్టమని వశిష్ఠులవారు చెప్పారు.

### భక్తిచేత సాధించలేనిది ఈ ప్రపంచములో ఏదీ లేదు

నా ఉద్దేశ్యములో ఈ మనస్సును నిగ్రహించటము అతి సులభము. శ్రద్ధతో మనము సాధనలు గావించిన అన్నియు మనకు సులభమే! 'సాధనమున పనులు సమకూరు ధరలోన.'

srisathyasai vachanamrutam

ప్రయత్నము చేయని సోమరులకు అన్నీ కష్టమే! నిజముగా ఈ మనస్సును అరికట్టటము, మనస్సును నిర్మలము గావించటము, అమనస్కము గావించుకోటము యిది అత్యంత సులభమైనది. దీనికి మార్గములు లేకపోలేదు. అదే భక్తి మార్గము. భక్తిచేత సాధించలేనిది ఈ ప్రపంచమునందు ఏదియు లేదు. భక్తి కలిగినవానికి ఏ శక్తినైననూ సాధించ వీలగును. దీనికి మించినది మరొకటి ఈ లోకమున లేదు.

**సకల శాస్త్ర పురాణ సంగ్రహ వేత్తయై**
**వేదాంత వేద్యుడౌ విబుధుడైన**
**రక్తి ఏపారగ రమ్య హర్మ్యంబుల**
**రమియించు రాజ చంద్రముడునైన**
**రణరంగమందు పరాభూత రిపుడౌచు**
**వెల్గొందు జగదేక వీరుడైన**
**దారిద్ర్య దేవతా దాక్షిణ్యమునకుందు**
**దౌర్భాగ్య విభుడగు దాసుడైన**

**భక్తి లేనిచో యెందుకు పనికిరాడు**
**భక్తి లేనట్టి ఆ జగద్భర్త కన్న**
**భక్తిపరుడగు దాసుడే వంద్యుడగును**
**ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు**
**సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులార**

భక్తి అనగా ఏమిటి? ఏదో ఒక పటము పెట్టటం, ఒక విగ్రహము పెట్టటం దానికి ఇన్ని పూలు పెట్టి నమస్కారము చేయటం, హారతులు యివ్వటం యిదియా భక్తి? ఈనాటి భక్తిలోపల నమస్కారముకూడను శ్రద్ధగా చేయటం లేదు. ఎక్కడో ఏదో మనము పొందబోతున్నామనే ఆతృతచేత 'నమస్కారం' అని ఒక్క క్షణములో నమస్కారము చేస్తున్నారు, భగవంతునికి. శాంతితో, ప్రేమతో హృదయపూర్వకముగా దశేంద్రియములు చేర్చి ఒక్కతూరి పవిత్రమైన భావముతో నమస్కారము చేసే యోగ్యతను ఈనాడు మానవుడు కోల్పోయాడు.

sri sathyasai vachanamrutam

నిరంతరము సంపాయించుకుంటున్నాడు, ఏమిటి? ధనము. అయితే, మానవుని జీవితమునకు ప్రధానమైన ప్రక్రియ ఏ ధనము అనేదానిని గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. నా దృష్టిలో ధనము అత్యవసరమే! కాని అధిక ధనముకూడను మనకు ఆనందము చేకూర్చదు. ధనలేమికూడను మనకు ఆనందమును చేకూర్చదు. ఇది కేవలము మనము పాదములకు ధరించే చెప్పువలె ఉండాలి. మన పాదములకు సరైన ఆదిగా ఈ చెప్పులు ధరించినామా చక్కగా శ్రమలేకుండా నడవవచ్చును. ఈ చెప్పులే కొంచెము వదులుగా వుండిన నడచటానికి వీలుకాదు. లేక చెప్పులే కొంచెము టైట్ అయిన నడచటానికి సాధ్యము కాదు. అదేవిధంగా ధనము తక్కువైనా కష్టమే, ఎక్కువైనా కష్టమే! కానీ ఈనాడు ఈ ధనము కేవలం ఎక్కువని చెప్పటానికి కాదు. మరింత ఎక్కువ! రాత్రింబవలు ధనచింతతప్ప దైవచింత ఏమాత్రము లేదు, మానవునికి. ధనాపేక్షతో పేరు ప్రతిష్టల నిమిత్తమై, గౌరవ మర్యాదల నిమిత్తమై సమాజములో గొప్ప పేరును సాధించాలని ఉద్దేశ్యముతో ప్రయత్నం చేసే భక్తి, భక్తి కాదు. కేవలము ఏదో ఒక అభీష్టము నిమిత్తమై ప్రార్థించటమనేది అనురాగ మవుతుందిగాని, భక్తి కానేరదు. అనురాగమునకు, ప్రేమకు చాలా వ్యత్యాసము వుంటుండాది. ప్రాకృత సంబంధమైన విషయములలో కోరేకోరికలన్నియు అనురాగమే! పరమాత్మ సంబంధమైన విషయములలో దీనిని ప్రవేశపెట్టటమే ప్రేమ. భక్తి అనే పదమునకు అర్థము మనము గుర్తించటానికి ప్రయత్నించాలి.

## కృంగి పొంగని సమత్వమును వహించటమే భక్తి

'భజ్' అనే ధాతువునకు 'తి' అనే ప్రత్యయము చేరినప్పుడు భక్తి అనే పదము ఏర్పడుతుంది. ఈ పదమునకు 'సేవ', 'భయముతో కూడిన స్నేహము', 'కొలువు' అని అనేక విధములైన అర్థములున్నవి. దీనిని నారదులవారు 'భజ సేవాయాం' అనగా 'భగవంతుని ప్రేమతో సేవించటమే భక్తి' అన్నారు. కానీ, చిత్తశుద్ధిచేత స్థిరబుద్ధిని నిలిపి భగవంతుని గుణగానములను గావించే మార్గమే భక్తి అని గార్గుడు ఉపదేశించాడు. మనోవాక్కాయ కర్మలయొక్క పవిత్రతను గురించి, వీటియొక్క పరిశుద్ధతను గురించి, కేవలము ప్రేమ నిమిత్తమై ప్రేమించటమే భక్తి అని పరాశరుని కుమారుడైన వ్యాసుడు బోధిస్తూ వచ్చాడు. అయితే లోకములో ఒక్కొక్కరు



srisathyasaivachanamrutam

ఒక్కొక్క విధమైన బోధలచేత భక్తి ప్రపత్తులను ప్రచారము గావిస్తూ వచ్చారు. కానీ నిజముగా ఈ భక్తియొక్క స్వరూపాన్ని మనము నిరూపించాలంటే సహజమైన హృదయమును భగవంతునకు ఏకత్వము గావించే మార్గమే భక్తి అని. సుఖదుఃఖములయందు యిది సమత్వముగా భావించి నింద నిష్ఠూరములకుగాని, లాభనష్టములకుగాని, కష్టమునకుగానీ, ఆనందమునకుగాని మనస్సు చలింపక భ్రమించక స్థిరత్వముతో కూడిన ప్రేమతత్త్వమే భక్తి అన్నారు. దుఃఖమునకు కృంగక సుఖమునకు పొంగక, కృంగి పొంగనటువంటి సమత్వాన్ని వహించటమే భక్తి.

పాండవాగ్రజుడైన ధర్మజుడు యిట్టి మార్గమునే అనుసరించాడు. రాజసూయ యాగము చేసిన వైభవమునందుకూడను కృష్ణునే స్మరించాడు. తన పత్నియైన ద్రౌపదిని కౌరవ సభలో పరాభవము గావించే సమయములోకూడను చలించక 'కృష్ణా!' అని కృష్ణునే స్మరించాడు. అర్జునుని కుమారుడైన అభిమన్యుని హతమార్చినప్పుడు కృష్ణునే స్మరించాడు ధర్మజుడు. పన్నెండు సంవత్సరములు కష్టములు అనుభవించి కారడవులలో కాలమును గడపిన సమయమునందుకూడను కృష్ణునే స్మరించాడు, ధర్మజుడు. తిరిగి విజయము పొంది హస్తినాపురమున రాజ్యమును పట్టాభిషేకము గావించుకునే సమయమునందుకూడను కృష్ణునే స్మరించాడు. కష్టములకు, దుఃఖములకు ఏమాత్రము విచారము చేయలేదు. కేవలము తాను నిమిత్త మాత్రముగా జీవిస్తూ వచ్చాడు. సముద్రములో లక్షలాది జలచరములు నివసిస్తున్నాయి. అందులోకొన్ని జలచరములు మరణిస్తున్నాయి, కొన్ని పుడుతున్నాయి. కానీ మరణించినవానికి సముద్రము దుఃఖించటముగానీ జన్మించినవానికి సముద్రము ఆనందించటముగాని జరగటం లేదు. జరిగేది జరుగుతూనే వుంది. వాటికి, సముద్రమునకు ఎట్టి సంబంధము లేదు. అన్నీ తనలోనే జరుగుతున్నప్పటికిని తాను ఏ మాత్రము ఎట్టి సంబంధము పెట్టుకోవడం లేదు. అదేవిధంగా ధర్మజుడు తాను ఏ మాత్రము చలించక స్థిరచిత్తుడై సమత్వాన్ని పోషించుకుంటూ వచ్చాడు. జీవితములో కలిగిన కష్టములకు నష్టములకు, దుఃఖములకు విచారములకు, ఆనందములకు కూడను క్రుంగక పొంగక స్థిరచిత్తుడై కృష్ణుని స్మరిస్తూ వచ్చాడు. ఇట్టి సమభావమును వహించి సర్వేశ్వరత్వమును తనలో వరించి యీ జగత్తును కేవలము భ్రమగా యెంచి ధర్మమును నిర్వర్తించటమే నిజమైన భక్తునియొక్క కర్తవ్యము.

srisathyasaivachanamrutam

**భక్తికి లక్షణం ఆత్మానందమును సాధించడం, దైవప్రేమను పొందడం**

భక్తి అనగా కేవలము దేవాలయములకు వెళ్లటము, పూజలు చేయటము, వ్రతములు చేయటము ఏదో కొండంత ఆశలు లోపల పెట్టుకొని భగవంతునికి కొబ్బరికాయలు కొట్టటము యిలాంటివన్నీ అల్పమైన కృత్యములు. భగవంతుని అవమానపరిచే కార్యములు. అనేకమంది తుచ్ఛమైన వాంఛలు నెరవేర్చుకొనే నిమిత్తమై భగవంతునికూడను మోసగిస్తున్నారు. భక్తి కేవలము ఒక వ్యాపారరంగముగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఓ భగవంతుడా! నీకు యిది యిస్తాను, నాకు అది యియ్యి, యిలాంటి వ్యాపారముగా చేస్తున్నారు. నాకు లాటరీలో పదిలక్షలు డబ్బువస్తే నేనొక వేయి యిస్తాను అంటాడు. తను పదిలక్షలు యివ్వటమేమిటి తిరిగి వేయిరూపాయలు భగవంతునికి అందించటమేమిటి? ఇంకా మరికొంతమంది అజ్ఞానములో వుండినవారు తుచ్ఛమైన బొచ్చు యిచ్చి వుచ్ఛమైన కోరికలు కోరుతున్నారు, తిరుపతిలో. ఇదా మనము కోరవలసినది? ఇది కాదు, మనము సాధించవలసినది. మనము సాధించవలసినది ఆత్మానందము. దైవప్రేమను మనము సాధించాలి. ఆ ప్రేమ అణుమాత్రము వుండిన అనంతమైన విజయమును సాధించగలము.

**ఈనాడు మానవజీవితము కేవలము భౌతిక సుఖములనే ఆశిస్తున్నది**

అట్టి ప్రేమను పొందినప్పుడు సర్వముకూడను అందులోనే లీనమైపోతుంది. బంగారు మనచేతిలో వుంటే రకరకములైన నగలు చేయించుకోవచ్చు. చక్కెర మనచేతిలో వుంటే కావలసినన్ని తీపి పదార్థములు మనము వండుకోవచ్చు. అన్నింటియందు వుండిన చక్కెర ఒక్కటే, అన్ని ఆభరణములందు ఉన్న బంగారము ఒక్కటే!

**శృంగారములు వేరు బంగారమొక్కటే**
**పశుల వన్నెలు వేరు పాలు ఒక్కటే**
**జీవ జాతులు వేరు జీవుండు ఒక్కటే**
**జాతి నీతులు వేరు జన్మమొక్కటే**
**పూల జాతులు వేరు పూజ ఒక్కటే**
**దైవమొక్కడె గాని వేరుకాదు**

### దర్శనంబులు వేరు దైవమొక్కడే

వారి వారి భావరాగములు పురస్కరించుకొని దైవము ఒక్కొక్క రూపములో దర్శనము యివ్వవచ్చుగాని ఒక్కొక్క జాతికి ఒక్కొక్క మతమునకు ఒక్కొక్క దైవము లేదు. ఒకరి యిష్టదైవమును మరొకరు విమర్శించటము, మరొకరి యిష్టదైవమును యింకొకరు విమర్శించటము విశాలమైన హృదయము కాదు. సంకుచితమైన మనస్సులకే యిట్టి తుచ్ఛ భావములు ఏర్పడుతూ వుంటాయి. ఈనాడు మానవ జీవితము కేవలము భౌతికమైన సుఖములనే ఆశిస్తున్నాది. అవి అవసరమే! కానీ, అన్నింటికంటె అత్యవసరమైనదేమిటో దానినికూడను లక్ష్యమునందు వుంచుకోవాలి. ఈనాడు అన్ని రంగములందు అవినీతి అనే పిశాచము ప్రళయ తాండవము చేస్తున్నాది. నీతి, ప్రేమ, ధర్మము, కరుణ అనే సహన భావము, సద్గుణములు ఎక్కడా కనిపించటము లేదు. ధనార్జనే జీవితముయొక్క లక్ష్యముగా భావిస్తున్నారు. ఇంద్రియ భోగములే జీవిత పరమావధిగా భావిస్తున్నారు. ఇదా మానవునియొక్క కర్తవ్యము? మానవునిగా పుట్టి మానవునిగా పెరిగి మానవుడనిపించుకొని యింత తుచ్ఛమైన కార్యములో జీవితము వ్యర్థము గావించుకోటము సరైన కర్తవ్యము కాదు.

### భక్తియే మనకు ఎన్నో విధములైన శక్తిని చేకూరుస్తుంది

నరుడనగా ఎవరు? నరుడనగా కేవలము ఆత్మ అనే అర్థము. ఆత్మనుండియే ఆకాశాది భూతములు ఉద్భవించాయి. ఈ ఆకాశాది భూతములకే నారములని పేరు. నారములనగా జీవ సముదాయమే! నారములనే జీవసముదాయములకు ఆధారమైనవాడు కనుకనే నారాయణుడని పేరు. కనుక నారాయణుడనగా నరుడే! నరః. 'రః' అనగా నశించటము. నరః అనగా నశించనివాడు, నారాయణుడు. నరః అనగా మరొక అర్థము. దారిని గొనుపోవువాడు అని అర్థము. ఎట్టి దారిని గొనిపోయేవాడు? పరమపావనమైన పవిత్ర స్థానమునకు గొనిపోయేవాడు. ఈ విధంగా నరత్వమునకు యెన్నియో అర్థములుంటున్నాయి. ఈ అర్థములను ఎవరికి సరైనరీతిగా, ఎవరికి అన్వయించిన రీతిగా వారు అర్థము చేసుకుంటూ పోతున్నారు. ఇవి సరైన శాస్త్రార్థములు కావు. నీకు తగినట్టు నీవు, మరొకరికి తగినట్టు మరొకరు యీ విధముగా దీనిని విభజించటముచేత శాస్త్రముయొక్క యథార్థము అనర్థముగా

sri sathyasai vachanamrutam

మారి అనర్థములుకూడా నానార్థములుగా బయలుదేరుతున్నాయి. కనుక, భగవంతుని పొందుటకుగాని, రాగద్వేషములు దూరము గావించుకొనుటకుగాని ఒక్క ప్రేమతత్త్వమే ప్రధానమైన శక్తి.

ప్రేమస్వరూపులారా! మానవ జీవితము క్షణ భంగురము. దేహము నీటి బుడగవంటిది. మనము సంపాదించిన ధనముగానీ మనము ఆర్జించిన భవనములుగాని ఎంతకాలము మనము అనుభవించగలము? దీనికై మన కాయమును, కర్మమును, కాలమును వ్యర్థము గావించరాదు. తినుటకు తిండి, కట్టుటకు బట్ట, వుండుటకు కొంప ప్రతి ఒక్కరికి అత్యవసరమే! కానీ, ఈ ఆశ మితిమీరి పోతున్నది. ఆశలకు ఒక హద్దే లేదు. ఈ ఆశలలో మునిగినవానికి దైవానికి నమస్కారము చేయటానికికూడను కాలము చాలదు. ఎవరైనా సమావేశములో పాల్గొనాలంటే నాకు కాలమే లేదు అంటాడు. రేపు యముడు వచ్చి రమ్మన్నప్పుడు 'అయ్యా! యమధర్మరాజా! నాకు రావటానికి వీలులేద'ని చెప్పటానికి వీలవుతుందా?

**పద పద మంచు కింకరులు పాశము లాగెడు వేళ బంధువుల్**
**దబ దబ మంచు బైట పెట్టుడిక లాభము లేదని చెప్పువేళ**
**ఆలుబిడ్డలు లబలబ ఏడ్చువేళ**
**తరమా హరినామము నోట బల్కగన్**

అప్పుడు కొంచెము కాలవ్యవధి తీసుకొని 'అయ్యా! యమధర్మరాజా! కొంచేముసేపు వుండు, నేను ప్రార్థన చేస్తా'నంటే ఎవరు ఒప్పుకుంటారు? మన జీవితము లోపల ప్రధానమైన కర్తవ్యము, మానవుని ప్రధానమైన లక్ష్యము భగవద్భక్తియే! ఈ భక్తియే మనకు శక్తి నందిస్తుంది. ఈ శక్తియే మనకు భుక్తిని చేకూరుస్తుంది. ఈ భక్తియే మనకు రక్తినందిస్తుంది. ఈ భక్తి ననుభవించి విరక్తిలో మనము ప్రవేశిస్తాము. ఈ విరక్తియే ముక్తిని చేకూరుస్తుంది. కనుక భక్తియే మనకు ఎన్ని విధములైన శక్తినో చేకూరుస్తుంది.

**దివాత్మ తత్త్వమును మనము కొంతవరకు గుర్తించాలి**

కనుక భక్తిని ఆధారము చేసుకొని మన కర్తవ్యమును నిర్వర్తించుటకు కంకణము కట్టుకోవాలి. ఈ విధమైన మానవుని కర్తవ్యధర్మములు మనము ఈనాడు విస్మరిస్తున్నాము.

sri sathyasai vahini amrutam

కేవలము మనలను మోసబుచ్చి అనేక భ్రమలలో ముంచి మానవత్వమునకు మసిబూసే మార్గములో ప్రవేశింపచేసే ఈ భౌతికమైన సుఖములకు మనము లొంగిపోతున్నాము. ఏది మనకు శాశ్వతము? ఏదీ శాశ్వతము కాదు. జాగ్రతలో చూచినవి స్వప్నమునందే మనకు కానరావు. స్వప్నమునందు చూచినవి జాగ్రతయందు కేవలము అపహాస్యముగా తోచుతాయి. జాగ్రతవరకు జాగ్రత, సత్యము. స్వప్నమువరకు స్వప్నము సత్యము. జాగ్రతలో స్వప్నము లేదు. స్వప్నములో జాగ్రత లేదు. ప్రేమస్వరూపులారా! జాగ్రతలో, స్వప్నములో! మీరు వుంటున్నారు. జాగ్రత్ స్వప్నములు రెండునూ స్వప్నములే. ఇది day dream అది night dream. ఇది పగటికల, అది రాత్రికల. రెండు కలలు మనకు కల్లలే! కానీ, నీవు సత్యము. నీవు దేహము కాదు. నీవు మనస్సు కాదు. నీవు బుద్ధి కాదు. నీవు చిత్తము కాదు. నీవు అంతఃకరణము కాదు. నీవు ఆత్మస్వరూపుడవు. ఇలాంటి విశ్వాసము మనలో ఆవిర్భవించినప్పుడే భక్తి ప్రపత్తులు మనకు అభివృద్ధిగాంచి మానవత్వాన్ని సార్థకము చేస్తాయి. దివ్యాత్మ తత్త్వాన్ని మనము గుర్తించాలి. కొంతమంది ఆత్మ, ఆత్మ అంటే ఎక్కడ వుంది, ఎవరు చూచారు, అని ప్రశ్నలు వేస్తుంటారు. అనుభవమైనవారు లేకపోలేదు. కానీ, మనదృష్టికి వారు దూరంగా వుండవచ్చు. నీ భావానికి వారు అసత్యముగా తోచవచ్చు. ఒక చిన్న ఉదాహరణము. ఈనాడు బుధవారము, 19వ తేదీ అని నీవు చెప్తున్నావు. 'ఏమిటయ్యా ఈనాడు బుధవారమని ఎట్లా తెలుసు, ఈనాడు 19వ తేదీ అని ఎట్లా తెలుసు?' అని అడిగితే క్యాలండరులో చూస్తున్నాను అని సమాధానం చెపుతాడు. ఈ క్యాలండరు ఎవరు వ్రాసారు? ఎవరో సిద్ధాంతి వ్రాసాడు. ఆ సిద్ధాంతి ఏమి ఆధారము చేసుకొని రాసాడు? జ్యోతిష శాస్త్రము ఆధారము చేసుకొని రాసాడు. కాబట్టి దీనికి జ్యోతిషశాస్త్రమే ఆధారము, దీనిని ఎట్లునమ్ముతాము? ఈనాడు బుధవారమనేది ఏమైనా పేరు వేసుకొని వచ్చిందా? ఈనాడు 19వ తారీఖని అంతగట్టిగా ఏ విధముగా నొక్కి చెబుతున్నావు. దేని ఆధారము? కాగితములో వున్న క్యాలండరే!

అదేవిధముగానే ఆత్మ, బ్రహ్మ అనే శబ్దములు వేదమునుండి ఆవిర్భవించాయి. ఆత్మ కలదనేదానికి వేదమే ప్రమాణము. ఈనాడు బుధవారమని చెప్పటానికి వేదమే ప్రమాణము. దీనిని నమ్ముతున్నాము. వేద ప్రమాణమైన ఆత్మను నీవు నమ్మటం లేదు. కారణము వేదముపైన అంత విశ్వాసము లేదు. ఈ భౌతికముపైన నీకు అమితమైన విశ్వాసము వుంటున్నాది. ఒక్కొక్క

srisathyasaivachanamrutam

దానికి ఒక్కొక్కటి ప్రమాణముగా వుంటున్నాది. ఆ ప్రమాణములు విమర్శించుటకుగాని లేక ఖండించుటకుగాని ఎవ్వరికి అధికారము లేదు. ఒక చిన్న ఉదాహరణము. ఒక పిల్లవాడు రెండవపిల్లవానిని అడిగాడు, మీనాన్న ఎవరని? ఫలానివారు మానాన్న అని చెప్పుతున్నాడు. "నీకెట్లా తెలుసు? పుట్టినప్పుడా నీకు చూచే శక్తి, సామర్థ్యములు లేవు. అప్పుడు తెలివితేటలుకూడను లేవు. కనుక, నీవు అతనిని తండ్రి అని చెప్పటానికి ఏమి ఆధారము?" అని ప్రశ్నించినప్పుడు ఆ పిల్లవాడు చక్కని జవాబు చెప్పవలసివస్తుంది. "ఇతను నా తండ్రి అని చెప్పుటకు నా తల్లియే ప్రమాణము." ఫలానివారు తండ్రి అని చెప్పుటకు తల్లికి తప్ప యింకెవరికి అధికారము లేదు. అదేవిధముగానే ఆత్మ బ్రహ్మ అని చెప్పుటకు ఒక్క వేదమే ప్రమాణము. కేవలము లౌకికమైన వాదోపవాదములు తప్ప మనము ఈ పవిత్రమైన దివ్యత్వాన్ని అవిశ్వాసముతో అలక్ష్యము చేస్తున్నాము.

**దైవనామమునకు మించిన మాధుర్యము మరొకటి లేదు**

పవిత్రమైన వేదశాస్త్ర యితిహాస పురాణములయొక్క ప్రమాణములు అర్థమైనా కాకపోయినా సకలవేదసారమును ఉపనిషత్తులుగా భావించి సకలోపనిషద్ సారమంతా భగవద్గీతగా భావించి, భగవద్గీతా సారమే భగవన్నామమని మనము భజించినప్పుడు, ఒక్క నామమే మిగులుతుంది. ఆ భగవన్నామమనే మిఠాయిని మీరు భుజించటానికి ప్రయత్నించండి. లోకములో అంగళ్లలోని చక్కెర మిఠాయిని తిని మీరు అజీర్ణవ్యాధికి గురికాకండి.

దైవనామమనే మిఠాయి యిదుగో రండి జనులార! దానిని ఎట్లా చేశారు?

**వేదసారమను గోధుమపిండిలో**
**వేదవాక్యమను క్షీరమె పోసి**
**ఆధారమైన పెద్ద బాండువ తీసి**
**ఆది మునులు దీనిని బాగుగ కలిపిరి ॥**

**భక్తియను ఖండ చక్కెరతెచ్చి**
**సుబుద్ధియను ఆవునెయ్యివేసి**
**అబద్ధమనియెడి మలినము తీసి**

sri sathyasai vacharamrutam

**ఆది మునులు దీనిని బాగుగ పంచిరి ॥**

**రకరకమైనది దైవ ప్రసాదము**
**సకల రోగ నివారణమోయి**
**ఒక్క కాసైనను ఖర్చు లేదోయి**
**తకరార్ చేయక పంచుకోండోయి ॥**

ఈ నామమునకు మించిన మాధుర్యము మరొకటి లేదు. సులభమైన మార్గము. గమ్యము తథ్యము. చేరేది ఏ విధమైన ఆటంకములు లేక చేరవచ్చు. కనుక పామరులుగాని, పరమహంసలుగాని, విద్యావంతులుగాని, విద్యాహీనులుగాని, కూటిపేదగాని, కోటీశ్వరుడుగాని అందరికి సమముగా అందించే నామము, యీ దివ్యత్వ మొక్కటియే! కనుక, ఈ ప్రేమతత్త్వమైన భక్తిద్వారా దివ్యమైన నామాన్ని స్మరించటము అత్యంత ఉత్తమమైన మార్గము.

**సర్వజీవులయందున్న సర్వేశ్వరుడొక్కడే అనే సమభావమును పెంచుకొనడమే నిజమైన భక్తి, ప్రపత్తుల లక్షణము**

ఇది ఏ విధమైన మార్పును కలిగిస్తుంది? నామము వుచ్చరిస్తూ ఆనందములో వున్మత్తుడౌతుంటే భగవంతునికూడను భరత నాట్యమాడిస్తుందట! ఈ నామమే శివుని నాట్యమాడించటానికి మూలకారణము. శివతాండవమునకు ఈ నామమే మూలకారణము. కేవలము భగవంతుని మాత్రమే కాదు తాండవమాడించేది, భక్తులను కూడను తాండవ మాడిస్తుందట! కేవలము భక్తులు మాత్రమే కాదు, తాను కూడను తాండవ మాడుతుంది. దైవము, భక్తులు, ప్రేమమూర్తులు ఒకే స్థానములో, ఒకే కాలములో నాట్యమాడే శక్తిసామర్థ్యములతో కూడినది ఈ భగవన్నామము. ఇలాంటి నామతత్త్వాన్ని మనము అర్థము చేసుకొని గానము చేస్తున్నామా? ఈనాటి భక్తి ప్రపత్తులు ఏ రీతిగా వుంటున్నాయి? రాగతాళములచేత భజన చేయుటము యిదే భక్తిగా భావిస్తున్నాము. ధ్యానమంటే ఏమనుకుంటున్నాము? ముక్కు మూసుకొని మూలకూర్చొని ధ్యానము చేయటమే ధ్యానమని భావిస్తున్నాము. ముసుగు వేసుకొని మూలకూర్చుంటే ధ్యానము కానేరదు. ఒక చేతిలో మాలను పట్టి, చెవులతో ఏవేవో వింటూ కన్నులతో ఎక్కడెక్కడో చూచుకుంటూ మాల తిరుగుతూ

sri sathyasai vachanamrutam

వుంటే చాలు యిదే నిజముగా ధ్యానమని భావిస్తున్నాము. జ్ఞానమంటే ఏమనుకుంటున్నాము? గ్రంథమును కంఠస్థము చేయుటవే జ్ఞానమని భావిస్తున్నాము. సన్యాసులంటే ఏమనుకుంటున్నాము. కాషాయ వస్త్రము వేస్తే సన్యాసియని భావిస్తున్నాము. ఈ కారణముచేతనే భారతదేశములో ధ్యానము, భక్తి, జపము అనే వాటిని మూర్ఖంగా విశ్వసించే మూఢులు దినదినమునకు పెరిగిపోతున్నారు. ప్రాకృతమైన ఈ వేషములు ధరించి ప్రాకృతమైన చర్యలనే విశ్వసించి, ప్రాకృతమైన మార్గములో ప్రవేశించిన మన పాపములు ఏమాత్రము చెదిరిపోవు.

**కాషాయ వస్త్రంబు కట్టిన మాత్రాన**
**కరతలామలకంబు కాదు భక్తి**
**నోటితో మంత్రంబు నుచ్చరించినతోడ**
**చేసిన పాపంబు చెదిరిపోదు**
**గీతను చేబట్టి కేకలు వేసిన**
**పుణ్యము మనయింట ప్రోగుపడదు**

**చెప్పుమాటలకు చేసెడి చేతలకు**
**సఖ్యమున్నవాడె సాధువగును**

ఇదే నిజమైన గుర్తు, సాధుత్వానికి. 'ప్రతి జీవియందు వున్న సర్వేశ్వరుడు ఒక్కడే!' అనే సమత్వ భావాన్ని వహించటమే నిజమైన భక్తి ప్రపత్తులకు మూలాధారము. కనుక, ఎవ్వరినికూడను మనము ఏవిధముగాను విమర్శించరాదు. 'సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి.' ఎవరిని తిరస్కరించినా కేశవుని తిరస్కరించిన వారమవుతాము.

## నామస్మరణయే కలియుగమునందు జీవనజ్యోతి

ప్రేమస్వరూపులారా! ముఖ్యముగా ఈనాడు మనము తెలుసుకోవలసినది నామస్మరణ. ఇదే కలియుగమునకు ప్రధానమైన జీవనజ్యోతి. ఈ జ్యోతిని పట్టుకొని మనము ప్రయాణము చేసితిమా, రాజ్యమంతా సంచరించవచ్చును. కాళ్లకు చెప్పులు వేసుకున్నవానికి యే ముళ్లమార్గములో ప్రవేశించినా ప్రమాదము లేదు. అంతేకానీ, ప్రపంచములోని ముండ్లన్ని ఏరివేయాలనే ప్రయత్నానికి పూనుకోవద్దండి. అన్నింటికి సులభమైన మార్గము నామస్మరణ.

sri sathyasai vachanamrutam

నామస్మరణే తరణోపాయము. ఈ కలియుగములో నామస్మరణకు మించినది లేదు. ఎంతోమంది జగత్తులోపల సకల వేదములు, సకల శాస్త్రములు క్షుణ్ణముగా చదివినవారు వున్నారు. అర్థమును గుర్తించినవారు వున్నారు. ఏమి ప్రయోజనము? ఆచరణయందు ఏకించిత్తైనా భగవత్తత్త్వమును వారు అనుభవిస్తున్నారా? ఈ ఆడంబర, అహంకార, స్వరూపాలు మనకు ఎందుకు? కలియుగమంతయు ఆడంబరములచేత ప్రకాశిస్తూ వుంటుంది.

**భగవంతుడు అవతరించటము మానవులకు ప్రేమ నేర్పే నిమిత్తమే!**

ఏమి చేసినా స్వార్థము, స్వప్రయోజనము. స్వార్థరహితమైన ప్రేమను మనము అనుభవించాలి. ఏదో మనకు ఉపదేశము చేయటంకోసంగానీ మీ బాధలు నివారణ చేయటంకొరకుగానీ, మీకు ఉన్నతస్థాయి నందించేకోసంగానీ, మీకు సాక్షాత్కారము చేకూర్చే నిమిత్తముగాని భగవంతుడు అవతరించలేదు. ఒక్క ప్రేమను పంచుకుంటే ఎన్నైనా శుభములు, సుఖములు అందులోనే కలుగుతాయి. భగవంతుడు ప్రేమ నేర్పే నిమిత్తము అవతరిస్తున్నాడనే సత్యాన్ని గుర్తించండి. ఒకరినొకరు ప్రేమించుకుంటే మనకు రాగద్వేషములు వుండనే వుండవు. పరుగెత్తిపోతాయి. ఈనాడు తండ్రిని బిడ్డ ప్రేమించటము లేదు. అన్నను తమ్ముడు ప్రేమించటం లేదు. అక్కను చెల్లెలు ప్రేమించటం లేదు. ఏమిటి ఈ జీవితము? ఇది కేవలము ప్రయత్నముతో లభించేది కాదు. విశ్వాసముతో తనయొక్క తత్త్వాన్ని తాను చక్కగా విచారణ చేసినప్పుడు ప్రేమ తనంతటతనే ఆవిర్భవిస్తుంది. దివ్యాత్మస్వరూపులారా! యిప్పటికే మీరు కాలమును చాలా వ్యర్థము గావిస్తున్నారు. భౌతికమైన జీవితముకొరకే మీరు చాలా కాలమును వ్యర్థము గావిస్తున్నారు. భౌతికమైన జీవితమునకే ముక్కాలు భాగము అర్పితము చేస్తున్నారు. ఇంక దైవత్వమును పొందటానికి మీకు ఎట్లా సమయం చిక్కుతుంది? ఏదో గడచిపోయినది, గడచిపోయినది. యింక ముందైనాకూడను యీ కాలము భద్రము చేసుకొని నా బిడ్డలు, నా కోడండ్రు, నా తల్లులు, నా తండ్రులు వీరికోసమే నా జీవితమనే భ్రాంతిలో కాలమును వ్యర్థము గావించకండి. ఈ భావములు వుండవలసినదే! వారియందు మీ కర్తవ్యమును మీరు నిర్వర్తించవలసినదే! కానీ, నిమిత్త మాత్రులుగానే వుంటుండి మీ మార్గమును మీరు అనుసరించాలి. ఎవరికి ఎవరూ లేరు. అందరికి భగవంతుడొక్కడే! ఆ విశ్వాసమును మనము

srisathyasaivachanamrutam

పెంచుకోవాలి. ఆ విశ్వాసమే లేకపోతే ఎంత ధనము వుండి ఏమి ప్రయోజనము?

**మనశ్శాంతి ఇవ్వని ధనము మట్టితో సమానమే!**

కోట్లమందిని నేను చూస్తున్నాను. ధనము వుంది, కావలసినంత. ఏ విధముగా? మట్టిలో రాళ్లు వుండినట్టుగా వుంటున్నాయి. కాని మనసులో శాంతి లేదు. మనసులో శాంతి లేని ధనము మట్టితో సమానమే! మానసికమైన శాంతిని మనము చేకూర్చుకున్న అదే ధనము, సర్వైశ్వర్యములు. ఇట్టి మార్గములో సంపాయించిన ఒక్కకాసైననూ ఒక కోటితో సమానము. అసత్యము, అన్యాయము, అక్రమము, అనాచారములతో సంపాయించిన కోట్లు అయినప్పటికి ఒక ఋష్ కోటుకు పనికిరాదు. భగవంతుడు దీనిని ఏమాత్రము చూడడు. అనేక పర్యాయములు చెప్పాను. కృష్ణతులాభారముయొక్క అంతరార్థము మీరు దృష్టియందుంచుకోండి. సత్యభామ ఎన్ని నగలు వేసినా, ఎంత ధనము వేసినాగానీ భగవంతుడు తూగలేదు. రుక్మిణీదేవి వేసిన భక్తితో కూడిన తులసిదళమునకు మాత్రమే తూగినాడు. దీని అంతరార్థము ఏమిటి? భగవంతుడు ధనమునకు చిక్కడు. నీ అధికారమునకు చిక్కడు. నీ కీర్తి మర్యాదలకు చిక్కడు. నీ గొప్ప హోదాకు చిక్కడు. నీ భక్తికి మాత్రమే చిక్కుతాడు. అట్టి భక్తిని మాత్రమే, భగవంతుని దక్కించుకునే భక్తిని మాత్రమే మనము సాధించాలి. భగవంతుని చిక్కించుకునే మార్గములో మనము ప్రవేశించాలి. లేకపోతే ఏమి ప్రయోజనము? ఎన్ని వుండి ఏమి లాభము? కనుక, నేటినుండికూడను మీరు సులభమైన మార్గము ననుసరించి దైవనామమును విశ్వసించి సర్వులకు నామమునే ఉపదేశించి తరించండి. ఏ సాధన చేయనక్కర లేదు. జపములు, ధ్యానము, క్రతువులు ఏది చేయనక్కర లేదు. ఒక్క నామ జపము చేస్తే అదే భగవద్గీతయొక్క సారము.

**భక్తులు భగవంతునికొరకు ఎంతటి ఆర్తి చెందుతారో, భగవంతుడు కూడా భక్తుని గురించి అంత ఆవేదన పడుతూంటాడు**

'యజ్ఞానాం జపయజ్ఞోస్మి,' అన్నారు. 'యజ్ఞములన్నింటియందు జపయజ్ఞము ఉత్తమమైనది,' అన్నారు. ఆ చేసే నామము హృదయమునుంచి రావాలి. పెదవుల నుండి రాకూడదు. ప్రేమ పూరితముగా నాభినుండి అది ప్రారంభము కావాలి. 'యద్భావం తద్భవతి'. నీ పెదవులనుండి వస్తే భగవంతుని ప్రేమకూడా పెదవులనుండే వస్తుంది. నీది

sri sathyasai vachanamrutam

హృదయమునుంచి వస్తే భగవంతుని ప్రేమ హృదయమునుంచి వస్తుంది. భక్తులు భగవంతునిగూర్చి ఎంత వేదన పడుతూ వుంటారో భక్తునిగూర్చి భగవంతుడుకూడను అంత ఆవేదన పడుతూ వుంటాడు. అ సత్యాన్ని మీరు గుర్తించటం లేదు. ముక్కాలు భాగమంతా లోకసంబంధమైన వ్యాపారములో ప్రవేశపెడుతున్నాము. ఏదో కాలు భాగము మాత్రమే మనము భగవంతుని కోసము ప్రార్థిస్తున్నాము. యిరవైనాల్గు గంటలలోపల యిరవైమూడు గంటల ఏభైఐదు నిముషములు భగవంతునికోసంకాకుండా జగత్తుకోసం మీరు ఉపయోగపెడుతుంటే ఎంత బలమును మీరు పుంజుకుంటున్నారు? దినమునకు యిరవైనాలుగు గంటలు. యిరవైమూడు గంటల ఏభైఐదు నిముషములు మీరు జగత్తులో వ్యర్థము చేస్తున్నారే, దీనివల్ల ఏమి సాధించారు? తెల్లవారి ఒక నిముషము నమస్కారము. రాత్రి ఒక నిముషం నమస్కారము చేస్తే ఈ రెండు నిముషాలకే యింత ఫలితము కావాలని ఆశిస్తున్నారు. ఇది కోరవలసినదేనా? కోరటానికైనా సిగ్గులేదా? ఎట్లా కోరుతున్నారు మీరు? మీ హృదయానికి హృదయమేకదా సాక్షి. అందుకోసమే తిరుత్తొండాళ్వారు చెప్పారు: "మనసుక్కు మనం సాక్షి. దేహక్కు గుణంసాక్షి. సర్వమునకు స్వామి సాక్షి. ముఠాలకు మూర్ఖం సాక్షి" అన్నాడు. ఈ ముఠాలుగా మనము ప్రవర్తిస్తున్నాము కానీ భగవంతునికి మనం యిచ్చుకోటానికి సిద్ధముగా లేము, పుచ్చుకోటానికి సిద్ధముగా వున్నాము. మన డబ్బును మనం బ్యాంకులోపెట్టి తిరిగి అందులో కొంత తీసుకోవాలంటే మనం చెక్కు రాస్తేనే ఆ డబ్బు మనకు వస్తుంది. షాపుకి వెళ్ళి ఐదు రూపాయలు షాపు కీపరుకి యిస్తే రుమాలు మనకు యిస్తాడు. దేనికైనా యిచ్చుకుంటేనే కదా, పుచ్చుకోటానికి అర్హత. ఆహా! ఈనాడు కలియుగ ప్రభావము లోపల వున్న one way traffic పుచ్చుకోటమేగాని యిచ్చుకోటం లేదు. ఇది కృత్రిమమైన భక్తి. ఇలాంటి కృత్రిమ భక్తిని ఈనాటినుండి మీరు నిర్మూలము గావించుకొని సక్రమమైన భక్తిని, సరైన భక్తిని, ప్రేమ పూరితమైన భక్తిని అభివృద్ధి గావించుకోవాలి. ఇది నా కోసం కాదు, జగత్తు కోసం, మీ కోసం. మీకు మీరు బాగుపడగలరు. మీనుండి జగత్తును బాగుపరచగలరు. అప్పుడే 'లోకాస్సమస్తా సుఖినో భవంతు.' అందరూ సుఖముగా జీవించగలరు.

ప్రేమస్వరూపులారా! ఏ పనులున్నప్పటికి విసర్జించి నామస్మరణలో మీరు ప్రవేశించండి. నెలకొక్క తూరైననూ దేవాలయమునకు వెళ్లరు, కొంతమంది పాపులు. ఏమి వీరికి పని?

sri sathyasai vahamrutam

దేవాలయమునకు పోని పని, గాడిదలను కాసే పని, ఏముంది వీళ్లకు? మరి మేము భక్తులము, భక్తులము అని చెప్పుకుంటున్నారు. చెప్పుకోటం సిగ్గుచేటు. అనేకమంది పెద్దలుకూడను ఆ విధముగా ప్రవర్తిస్తున్నారు. మహనీయులుకూడను ఆ విధముగా ప్రవర్తిస్తున్నారు. ఇది ఏమి కలి ప్రభావము? కాదు, కాదు. అందరికి సమానమైన హక్కు నామమే! ఎవరి బోధనా మనకు అక్కర లేదు. ఎవరి ఉపదేశములు మనకు అక్కర లేదు. అంతరాత్మయే నీకు ఉపదేశిస్తున్నాది. అదే నీకు మంత్రము. దినమునకు 21,600 పర్యాయములు లోపలినుంచి వస్తున్నాది, 'సోహం సోహం' అని. ఈ సోహంయొక్క అంతరార్థము ఏమిటి? సో...హం... అదే నేను. 'భగవంతుడనే నేను. నేనే భగవంతుడు.' ఈ ఉపదేశము మనము విస్మరించి ఎక్కడకెక్కడకోపోయి 'చేతిలో డబ్బు, చెవిలో మంత్రం.' ఇవా ఉపదేశములు? భగవంతుని నామాన్ని ఉపదేశించే అధికారము ఎవరికీ లేదు. భగవంతుడే తానై ఉపదేశించేది ఎవరికి? కనుక, నీకు తోచిన నామము నీవు ఉచ్చరించుకుంటూ రా. అచ్చమైన సత్యమైన మార్గమును మీరు అనుసరించండి.

**(తేదీ. 19-10-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam